

ఐఎంఏ ఆధ్వర్యంలో హోలీ వేడుకల్లో డాక్టర్లు

## 'కలర్'ఫుల్ ఎంజాయ్

- అంబరాన్నంటిన హోలీ సంబురాలు



రంగులు చల్లుకుంటున్న ఉద్యోగులు

కమాన్ చౌరస్తా, మార్చి 14 : హోలీ సంబురాలు శుక్రవారం ఉమ్మడి జిల్లాలో అంబరాన్నంటాయి. పల్లె, పట్నం.. ఊరూ వాడలన్నీ సప్తవర్ణాలతో నిండిపోయాయి. 'హో లీ హోలీల రంగ హోలీ.. చమ్మకేలిల హోలీ' పాటలతో వీధులన్నీ సందడిగా మారాయి. చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ రంగుల్లో మునిగిపోయారు. యువతీయువకులు నృత్య చేస్తూ హంగామా చేశారు. ముఖ్యంగా జిల్లాకేంద్రాల్లో కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉద్యోగులు, నాయకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. రంగులు చల్లుకొని, హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

## పశువులకు చల్లచల్లగా



ఎండలు ముదురుతున్నాయి. మార్చి నుంచే ప్రతాపం చూపుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు దాటుతున్నాయి. మధ్యాహ్నం వేళ రోడ్లు నిర్మానుష్యంగా మారుతుండగా, మనుషులే కాదు పశుపక్ష్యాదులు అల్లాడిపోతున్నాయి. కరీం'నగరం'లోని కిసాన్‌నగర్‌లోని ఓ డెయిరీలో గేదెలు వేసవి తాపానికి అల్లాడిపోతుండగా, చల్లదనం కోసం నిర్వాహకులు పైపుతో నీళ్లు కొడుతూ కనిపించగా, 'నమస్తే' క్లిక్ మనిపించింది.

**- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్**

## కాలువ నిర్మించేదాకా ఉద్యమిస్తాం



దీక్షలో కూర్చున్న మహిళా రైతులు

ఇల్లంతకుంట రూరల్, మార్చి 14 : రంగనాయక సాగర్ ఎల్ఎం 6 కెనాల్ నిర్మించేదాకా ఉద్యమం ఆగదని రైతులు స్పష్టం చేశారు. ఈ మేరకు మండలంలోని పెద్దపల్లింగాపూర్‌లో చేపట్టిన రిలేనిరాహారదీక్షలో రెండు రోజులుగా మహిళా రైతులు కూర్చొని నిరసన తెలుపుతున్నారు. శుక్రవారం హోలీ పండుగను సైతం లెక్క చేయకుండా తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాలకు చెందిన 12 గ్రామాల రైతులు దీక్షలో కూర్చొన్నారు. ఈ సందర్భంగా మహిళా రైతులు మాట్లాడుతూ సాగునీళ్లు లేక పంటలు ఎండిపోయి అన్నమో రామచంద్రా అని రైతులు మొత్తుకుంటున్నా.. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు హోలీ వేడుకలు జరుపుకోవడం ఏంటని ప్రశ్నించారు. రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. ఈ దీక్షలో వంద మంది రైతులు పాల్గొన్నారు.

## సిగ్గుమాలిన చర్య

- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి, మార్చి14: రాష్ట్రంలో పాలన చేతగాని, ఇచ్చిన హామీలను అమలు చేయలేని ప్రభుత్వాన్ని ప్రజల గొంతుకగా అసెంబ్లీలో నిలదీసిన సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేయడం సిగ్గుమాలిన చర్య అని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మండిపడ్డారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న ఆయనను సభ నుంచి సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకలను నొక్కాలనే ప్రయత్నం చేస్తున్నదని ధ్వజమెత్తారు. రాబోయే రోజుల్లో ఆ పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా తిరుగుబాటు చేస్తామని స్పష్టం చేశారు.

## సస్పెన్షన్ దారుణం

గోదావరిఖని, మార్చి 14: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని శాసన సభ నుంచి సస్పెండ్ చేయడం దారుణమని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఉద్దేశపూర్వకంగా సభ నుంచి సస్పెండ్ చేశారని, ప్రశ్నించే గొంతుకను నొక్కే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. వెంటనే జగదీశ్వర్‌రెడ్డి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.



జగిత్యాల : జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా వద్ద నాయకులతో కలిసి రేవంత్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దావ వసంత, నాయకులు

## ప్రజల గొంతునొక్కలేరు?

- **జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత**

జగిత్యాల, మార్చి 14 : సస్పెన్షన్‌తో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి బయటికి పంపించారేమో గానీ, నాలుగు కోట్ల ప్రజల గొంతు నొక్కలేరని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత స్పష్టం చేశారు. జగిత్యాల తహసీల్ చౌరస్తా వద్ద శుక్రవారం నాయకులతో కలిసి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా దావ వసంత మాట్లాడారు. అసెంబ్లీలో సమస్యలు చర్చకు రాకుండా అడ్డుకునే యత్నమని, అందులో భాగంగానే బీఆర్ఎస్ సభ్యుడిపై సస్పెన్షన్ విధించారన్నారు. ఇది చాలా అన్యాయమని మండిపడ్డారు. ఏడాదిన్నర కూడా గడవక ముందే అన్ని వర్గాల ప్రజల నుంచి వ్యక్తమవుతున్న వ్యతిరేకతను చూసి రేవంత్ రెడ్డి అసహనానికి గురై నోరు జారుతున్నారని, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు కాంగ్రెస్ డైవర్షన్ డ్రామాకు తీసిందని, అసెంబ్లీలో ప్రజా సమస్యలేవీ చర్చకు రాకుండా ఉండేందుకు జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేశారన్నారు. ఆయన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మన్లు సందీప్ రావు, మహిపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్లు శీలం ప్రియాంక, ఉదయశ్రీ, మఠం రాణి, సాయి, మండలాధ్యక్షులు ఆనందరావు, మల్లేశ్, తేలు రాజు, తుమ్మ గంగాధర్, సీనియర్ నాయకులు సాగి సత్యంరావు, గంగారెడ్డి, ప్రసాద్, మాజీ ప్రజాప్రతినిధులు శ్రీధర్, బీఎన్ గౌడ్, శంకర్, ఎల్ల రాజన్న, శ్రీనివాస్, అంజన్న, రిజ్వాన్, చింతల గంగాధర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# సస్పెన్షన్‌పై ఆగ్రహజ్వాల

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నిరసనలు



కార్పొరేషన్: కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

- జిల్లాకేంద్రాల్లో ప్రభుత్వ, రేవంత్ దిష్టిబొమ్మల దహనం
- కరీంనగర్‌లో అడ్డుకున్న పోలీసులు
- పెద్దపల్లిలో రాజీవ్ రహదారిపై ధర్నా

సిరిసిల్లటౌన్, మార్చి 14 : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడంపై జిల్లా కేంద్రాల్లో నిరసనలు వెల్లువెత్తాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు పార్టీ నాయకులు ఆందోళనలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రభుత్వ, రేవంత్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించారు. కాగా, పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. అనంతరం బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తూ నిరసన తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణితో పాటు నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రజల చేతుల్లో కాంగ్రెస్ పార్టీకి పరాభావం తప్పదని హెచ్చరించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా వద్ద జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత బీఆర్ఎస్ నాయకులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద రాజీవ్ రహదారిపై బీఆర్ఎస్ పెద్దపల్లి పట్టణాధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల నాయకులు కాంగ్రెస్ సర్కారు తీరుపై ధ్వజమెత్తారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై నిలదీస్తే ప్రతిపక్షాల గొంతు నొక్కడం ఏంటని నిలదీశారు. జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ అసెంబ్లీ చరిత్రలో చీకటిరోజుగా మిగిలిపోతుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని హత్యచేసిందని ధ్వజమెత్తారు. ప్రశ్నించేవారిని సభ నుంచి బయటకు పంపించడమేనా కాంగ్రెస్ మార్క్ ప్రజాపాలనా? అని ప్రశ్నించారు. పాలనను గాలికొదిలిసిన కాంగ్రెస్ ప్రతిపక్షాలను ఇబ్బందిపెట్టే చీకటి అధ్యాయానికి తెరలేపిందని విమర్శించారు. జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ పిరికిపంద చర్య అని అభిప్రాయపడ్డారు.



సిరిసిల్లటౌన్: అంబేద్కర్ చౌరస్తాలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



పెద్దపల్లి: జిల్లా కేంద్రంలో రాజీవ్ రహదారిపై ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## రాష్ట్రంలో రాక్షస పాలన

- **బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య**

సిరిసిల్ల టౌన్, మార్చి 14: ప్రజా పాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాక్షస పాలన నడిపిస్తున్నదని బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల కోసం కొట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులపై అక్కసు వెల్లగక్కుతున్నదని మండిపడ్డారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆగయ్య విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిపోతున్నదని విమర్శించారు. ఆ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీనియర్ శాసనసభ్యుడు, మాజీ మంత్రి అడిగితే ఆయనను సస్పెండ్ చేయడం శోచనీయం అన్నారు. కేసీఆర్ తన పదేళ్ల పాలనలో తెలంగాణను దేశానికే అగ్రగామిగా నిలిపారని ప్రశంసించారు. అటువంటి మహానాయకుడిని ఉద్దేశిస్తూ రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరిచి మాట్లాడడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. కాంగ్రెస్ రాష్ట్రంలో స్ట్రెచర్ మీద ఉన్నదని, త్వరలోనే కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, పార్టీ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, న్యాలకొండ రాఘవరెడ్డి, అడ్డగట్ల మురళి, జక్కుల నాగరాజు, కుంబాల మల్లారెడ్డి, గుగులోత్ సురేశ్‌నాయక్, జవహర్‌రెడ్డి, గజభీంకార్ రాజన్న, ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్, పడిగెల రాజు, పాతూరి రాజిరెడ్డి, సిరిగిరి మురళి, కందుకూరి రామాగౌడ్, వీరగోని శ్రీనివాస్‌గౌడ్, తదితర నాయకులు పాల్గొన్నారు.





గంగాధర మండల గర్శకుర్తిలో ఎండిపోయిన వరి పొలంలో దీనంగా కూర్చున్న రైతు ఎట్టెపు ఆదిరెడ్డి

గంగాధర మండల గర్శకుర్తిలో ఎండిపోయిన వరి పొలంలో ఎడ్లను మేపుతున్న రైతు లింగంపెల్లి వెంకటి

# గర్శకుర్తిలో సాగునీటి గోస

- చేతికందే దశలో ఎండుతున్న పంటలు
- రైతన్న కన్నీరుమున్నీరు

గంగాధర, మార్చి 14: రైతన్న రెక్కల కష్టం వృథా అవుతున్నది. రేయింబవళ్లు శ్రమించి వేసిన పంట చేతికందే దశలో చేజారిపోతున్నది. ఒకప్పుడు పుష్కలమైన జలాలతో బంగారు పంటలు పండించిన గర్శకుర్తిలో సాగునీటి గోస తీవ్రమైంది. సాగుకు నీరందక.. చెరువులు, కుంటల్లో చుక్క నీరు లేక కండ్ల ముందే పంట ఎండిపోతుండగా, రైతు ఆవేదన అరణ్య రోదనగా మారింది. నారాయణపూర్ రిజర్వాయర్ కుడికాలువ పూర్తి చేస్తే ఈ గ్రామం సస్యశ్యామలం కానుండగా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. దాదాపు వంద ఎకరాల్లో పంట ఎండిపోయిందని కన్నీరుపెడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఏ రంది లేకుండా సేద్యం చేశామని, 365 రోజులు సమృద్ధి జలాలతో పంటలు పండించుకున్నామన్నారు. ప్రస్తుతం పరిస్థితి తారుమారైందని, పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండిన పొలాలను మూగజీవాల మేతకు వదిలేస్తున్నారు.

### నాలుగెకరాల్లో ఎండిపోయింది

ఈ చిత్రంలో ఎండిన పొలంలో ఏడుస్తున్న రైతు పేరు ఎట్టెపు ఆదిరెడ్డి. గర్శకుర్తిలో ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. నాలుగెకరాల్లో వరి వేశాడు. సాగు నీరు లేక, బావిలో నీరు ఎల్లక పంట ఎండి పోయింది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని, ఏం చేయాలో తెలియడం లేదని ఆదిరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

### ఎడ్లకు మేతగా వరి పొలం

ఈ చిత్రంలోని రైతు పేరు లింగపెల్లి రాములు. ఊళ్లో మూడెకరాల భూమి ఉండగా, రెండెకరాల్లో పొలం ఎండిపోగా, ఎడ్ల మేతకు వదిలేశాడు. మరో ఎకరం పొలాన్ని బావిలో ఉన్న కొద్దిపాటి నీటితో అరుతడులు పెట్టుకుంటూ కాపాడుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడు. మరో 10 రోజుల్లో నీరు రాకపోతే ఈ ఎకరం కూడా చేతి కాదని, తనను ఆదుకోవాలని కోరుతున్నాడు.





గంగాధర మండల గర్శకుర్తిలో నాగం రాములుకు చెందిన ఎండిపోయిన వరి పొలంలో మేస్తున్న బర్రె, గొర్రెలు

### సాగు నీరు లేక ఇబ్బందులు

ఇదే గ్రామానికి చెందిన నాగం రాములుకు రెండెకరాల భూమి ఉండగా, వరి సాగు చేశాడు. బావిలో ఉన్న కొద్ది పాటి నీళ్లతో పొలాన్ని కాపాడుకోవడానికి విశ్వప్రయత్నం చేసి విఫలమయ్యాడు. నీరందక కండ్ల ముందే రెండెకరాల పొలం మొత్తం ఎండిపోయిందని వాపోతున్నాడు. పొలాన్ని బర్లకు, గొర్లకు వదిలేసినట్లు తెలిపాడు.

# పేదింట కొలువుల పుత్రులు

- గ్రూప్-4, 3, 2లలో మెరుగైన ర్యాంకులు

పెద్దపల్లి, మార్చి 14(నమస్తే తెలంగాణ)/ వీణవంక : నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆ యువకులు గ్రూప్స్‌లో మెరుగైన ర్యాంకులతో మూడేసి కొలువులు సాధించారు. గతంలోనే గ్రూప్-4లో ఎంపికై ఉద్యోగాలు చేస్తుండగా, ఇటీవల విడుదలైన గ్రూప్-2, గ్రూప్-3 ఫలితాల్లోనూ ఉత్తమ ర్యాంకులు సాధించి ఆదర్శంగా నిలిచారు.

### పట్టు వదలని విక్రమార్కుడు విశ్వసారథి



కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కొక్కుల అర్చన-సమ్మయ్య(ఆర్ఎంపీ డాక్టర్) దంపతులకు ఇద్దరు కొడుకులు కాగా, విశ్వసారథి చిన్న కొడుకు. వీణవంక శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో ప్రాథమిక విద్య, జమ్మికుంట కాకతీయ పాఠశాలలో ఉన్నత విద్య, హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేశాడు. గ్రూప్-4కు ఎంపికై చౌటుప్పల్‌లోని ఆర్డీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఉన్నత ఉద్యోగాల కోసం పట్టు వదలని విక్రమార్కుడిలా ఉద్యోగం చేస్తూనే చదువుపై దృష్టిసారించాడు. ఇటీవల ప్రకటించిన గ్రూప్-2లో 566 ర్యాంక్ సాధించగా, తాజాగా శుక్రవారం ప్రకటించిన గ్రూప్-3 ఫలితాలలో 205 ర్యాంక్ సాధించాడు. విశ్వసారథి గ్రూప్స్ పరీక్షల్లో సత్తాచాటడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

### గీత కార్మిక కుటుంబం నుంచి మహేశ్ గౌడ్



పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం సీతంపల్లి గ్రామానికి చెందిన మహేశ్‌గౌడ్‌ది నిరుపేద కుటుంబం. తండ్రి రాజాగౌడ్ గీతకార్మికుడు కాగా, 2022లోనే గుండెజబ్బుతో మరణించాడు. తల్లి శకుంతల వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నది. ఆయనకు ఇద్దరు చెల్లెళ్లు. ఎంఫార్మసీ చదివిన పెద్ద చెల్లెకు వివాహం కాగా, మరో చెల్లెలు మానస హైదరాబాద్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నది. పదో తరగతి వరకు మంథనిలోనే చదివిన మహేశ్ ఇంటర్‌లో మంథని డివిజన్ టాపర్‌గా నిలిచాడు. మంథని జేఎన్‌టీయూహెచ్‌లో బీటెక్‌లో మైనింగ్ కోర్సులో చేరాడు. అయితే, ఇంటర్ సమయంలోనే పబ్లిక్ సర్వీస్, జనరల్ అడ్మినిస్ట్రేషన్‌పై ఇష్టంతో మంథనికి చెందిన సామాజిక కార్యకర్త మహావాది సతీశ్ ఆర్థిక సహకారంతో యూపీఎస్సీ సివిల్స్ వైపు దృష్టిసారించాడు. అలా పబ్లిక్ సర్వీసెస్ వైపు మరింత ఆసక్తి పెంచుకున్నాడు. బీటెక్ పూర్తి కాగానే మైనింగ్ ఇంజినీర్‌గా ఛత్తీస్‌గఢ్, వెస్ట్‌బెంగాల్ రాష్ట్రాల్లో కోల్ ఇండియాలో పనిచేశాడు. తర్వాత యూపీఎస్సీకి ప్రిపేర్ అయ్యాడు. టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ రాగానే మంచి జీతం ఉన్న మైనింగ్ ఇంజినీర్ ఉద్యోగానికి రాజీనామా చేసి హైదరాబాద్‌కి వచ్చాడు. తర్వాత యూపీఎస్సీ కోచింగ్ కోసం బెంగళూరు వెళ్లాడు. అక్కడ ప్రిపేర్ అవుతున్న టైం లోనే తండ్రి మరణించాడు. అయినప్పటికీ మానసికంగా కుంగి పోకుండా ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాడు. టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌తో గ్రూప్-4లో సత్తా చాటి పెద్దపల్లి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం వచ్చిన గ్రూప్-2 ఫలితాల్లో 143వ ర్యాంకు సాధించాడు. తాజాగా విడుదలైన గ్రూప్-3లో 21వ ర్యాంకు సాధించి ఆదర్శంగా నిలిచాడు. ప్రతి రోజూ న్యూస్ పేపర్స్ రీడింగ్, ప్రభుత్వ వెబ్‌సైట్స్ తన ఉద్యోగ సాధనలో ప్రధానమని, ప్రతీ రోజు 10 నుంచి 12 గంటలు చదివానని, సివిల్స్ సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు మహేశ్‌గౌడ్ చెబుతున్నాడు.